# ఫేస్ వేల్యూ

రావి- ఎస్. అవధాని

ధనంజయరావు గొప్పదాత. ధార్మికుడు. తన సహాయం కోరివచ్చినవారినెప్పుడూ నిరుత్సాహపర్చ లేదు. ఎవ్వరికీ లేదనకూడదనే పాలసీ అతనిది. ధనంజయరావుకు పెద్ద బట్టల షాపుంది. అందులో అన్నిరకాల వస్త్రాలు, రెడీమేడ్ డ్రస్సులు హోల్‌సేల్ గానూ, రీటేల్‌గానూ అమ్ముతాడు.



ధనుంజయ రావు కస్టమర్స్‌ని ఆకర్షిం చడంలోనూ, షాప్‌కి వచ్చిన వారిని మర్యాదచేసి వారి గుడ్‌విల్ సంపాదించడం లోనూ దిట్ట. ఆ విధంగా అతనికి ఊర్లో అన్నివర్గాల ప్రజలతోనూ అనుబంధమేర్పడింది.

అయితే ధనంజయరావుకు ప్రజల్లో సంపాదించిన పరపతి, అభిమానం, గుడ్‌విల్ అతని బిజినెస్ అభివృద్ధికి తోడ్పడినా ఇంకో విధంగా అతణ్ని ఎంతో ఇబ్బంది పెట్టింది.

ఊర్లో ఎన్నో యువజనసంఘాలూ ,సేవా సమాజాలూ ఉన్నాయి. లయన్స్‌క్లబ్, రోటరీ, వాకర్స్ క్లబ్బులున్నాయి. అరడజను సాహితీ సంస్థలు, నాలుగు నాటకసమాజాలు ఉన్నాయి. ఇవిగాక బాబాభక్తమండలి, గణపతి భక్తమండలి, దేవీనవరాత్రి ఉత్సవ కమిటీలున్నాయి. వాట్లల్లో మెంబరుగా చేరమని వారి కార్యక్రమాలకు విరాళాలు ఇవ్వమని ధనంజయరావును బలవంతం చేయసాగేరు. ధనంజయరావు గొప్ప లౌక్యుడు. అయితే వచ్చిన ప్రతివారికీ వందలూ వేలూ విరాళాలు ఇస్తే ఇంకేమైనా ఉందా! అంధుచేత వచ్చినవారికి తను ఇచ్చే డొనేషన్ ఐదు లేక పదిరూపాయలు మించకుండా నియమం పెట్టుకుని తన నియమభంగం వాటిల్లకుండా ఎంతో నేర్పుతో నెట్టుకొస్తున్నాడు. అది అతని ప్రత్యేకత.

స్టేట్‌బాంక్ ఫీల్డాఫీసరుగా వచ్చిన మురళీకృష్ణ మంచి ఉత్సాహవంతుడు. ఎంతో చురుకైన వ్యక్తి. "ఫేస్‌వాల్యూ ఉంటే ఏపని చేసినా రాణిస్తుంది." అంటాడు. ఫేస్‌వాల్యూ ఉన్న హీరో, హీరోయిన్లను బుక్‌చేసి ఎటువంటి పిక్చరు తీసినా నిర్మాతలు డబ్బు చేసుకుంటున్నారు. ఫేస్‌వాల్యూతో సాధించ లేనిదేదీ లేదంటూ గంటల కొలదీ అనర్గళంగా ఉపన్యాసమివ్వగలడు మురళీకృష్ణ.

మురళీకృష్ణ ఉత్సాహం, నేర్పరితనం, తెల్సుకుని ఒక ఆధ్యాత్మికసంస్థ స్వర్ణోత్సవాలకు కార్యదర్శిగా నియమించేరు. కార్యక్రమానికి డొనేషన్స్ సంపాదించడంలో తన ఫేస్‌వాల్యూ తెలిసేలా చెయ్యాలనుకున్నాడు.

ధనుంజయరావు ఊర్లో పెద్ద బిజినెస్‌మేన్. గొప్పదాత అని పేరుపొంది ఎవరికీ ఇంతవరకూ పదిరూపాయలకంటే ఎక్కువ విరాళం ఇవ్వలేదని తెల్సు కున్నాడు. అటువంటివాడి వద్ద నుండి తను కనీసం వెయ్యి న్నూటపదహార్లు డొనేషన్ వసూలు చేసి తన ఫేస్‌వాల్యూ అందరికీ తెలియ జేయాలనుకున్నాడు.

మురళీకృష్ణ ధనంజయరావును కల్సుకుని సంస్థ స్వర్ణోత్సవ కార్యక్రమాల గురించి

చెప్పేడు. "ఆ సందర్భంలో ఊళ్లో మంచివ్యాపారవేత్తగా, గొప్ప ధార్మికునిగా పేరుపొందిన మిమ్మల్ని మా సంస్థ సన్మానించదలిచింది. మీరు అనుమతిస్తే కరపత్రాలు ప్రింట్ చేయాలి" అన్నాడు.

మురళీకృష్ణ ప్రపోజల్‌కి ధనంజయరావు ఎంతో ఆశ్చర్యపడి "ఆఁ ! ఎందుకండీ ఇవ్వుడీ అనవసర ఖర్చూ,ఆర్భాటం...ఆ డబ్బు మరోమంచిపనికి ఉపయోగించవచ్చు కదా!" అన్నాడు మొహమాటంగా.

"మీరలా అనడమే మీ గొప్పతనానికి తార్కాణం. మీలాంటి ధార్మికుల్ని సన్మానించడం కంటే మంచిపని మరొకటి లేదు. " అని ధనంజయరావును సన్మానానికి ఒప్పించేడు మురళీకృష్ణ

"మాసంస్థకు తమరు ఇవ్వబోవు విరాళం సన్మానసభలో వేదిక మీద ప్రకటించి ఇవ్వమని మా కోరిక" అన్నాడు లౌక్యంగా.

స్వర్ణోత్సవసభకు ఊర్లో ప్రముఖులు, ప్రజలు చాలామంది వచ్చేరు.

ధనంజయరావు గొప్ప వ్యాపారవేత్తగా, ధార్మికుడిగా, ఊర్లోజరిగే ప్రతికార్యక్రమానికీ విశాల హృదయంతో విరాళమందిస్తున్న దాతగా పేరు పొందిన వ్యక్తి అనీ, వారు స్వర్ణోత్సవ కార్యక్రమాలకు తమ విరాళం ప్రకటించి అందజేస్తారనీ మురళీకృష్ణ సభ లో ప్రకటించేడు.


ధనంజయరావు తనను సన్మానించినందుకు ధన్యవాదాలు తెలియజేసి తన వంతు విరాళం "వెయ్యిన్నూటా పదహార్లు" అని ప్రకటించి చెక్‌ను కార్యదర్శి మురళీకృష్ణకు హుందాగా అందజేసేడు.

మురళీకృష్ణ ముఖం సంతోషంతో విప్పారింది. తన ఫేస్‌వాల్యూతో సాధించిన ఘనకార్యంగా భావించి చెక్ అందుకుని మరొకమారు ధనంజయరావును పొగిడేడు. సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపేడు.

మర్నాడుదయం చెక్ బేంక్‌లో ప్రజంట్ చెయ్యబోయి చూసేడు.

ధనంజయరావు సభలో ప్రకటించి ఇచ్చిన డొనేషన్ "వెయ్యిన్నూటా పదహార్లూ" రూపాయలు కాదని అవి కేవలం పైసలు మాత్రమే అని తెల్సుకుని నిర్ఘాంతపోయేడు ఫేస్‌వాల్యూ మురళీకృష్ణ

## మగాళ్లు ఆత్మీయంగా మాట్లాడరేం?



**యువతి:** అసలు మగాళ్లు కాస్త ఇంటిమేట్‌గా మాట్లాడచ్చుగా! వాళ్లు మాట్లాడాలని మనం ఆశించినకొద్దీ ఆ వైపు, ఈ వైపు చూస్తారు. ఊఁ అంటూ మూలుగుతారు. నోరు చప్పరిస్తారు కానీ మనం ఏం వినడానికి ఇష్టపడ తామో అది మాత్రం అనరు మహానుభావులు. ఎందుకంటావు?

**వనిత:** నా కేసూ అంతే! దగ్గరగా హత్తుకునిపోయి కూచుని, 'స్వీట్ నథింగ్స్' ఏవైనా చెబుతాడేమో విందామంటే, అతనికి నోరు పెగలదే! మరీ మూడ్‌లో ఉంటే నా జుట్టు నిమురుతాడంతే...అదేదే రవ్వంత సడిలేని రసరమ్యగీతా లాలాపించినట్లు నేననుకోవాలి కాబోలు.

**ప్రమద:** నిజం చెప్పాలంటే, నా ఫ్రెండ్‌కి అందమైన భావాలున్నాయి. చక్కగా, లాజికల్‌గా మాట్లాడగలడు కూడా. కానీ ఖర్మంచాలక "హాయిగా కాస్సేపు కబుర్లు చెప్పుకుందామా" అంటే చాలు, నోరు మూతబడిపోతుంది. మూగనోము పట్టేసినట్టయిపోతాడు. ఆ భావాలన్నీ నాతో పంచుకోవడమెందుకనుకుంటాడో, లేక నేను తగనో!

**కుమారి:** ఓసారేం జరిగిందో తెలుసా...రాజా స్టోర్స్‌లో మంచి పాంటీ చూశా. స్కై బ్లూ కలర్ ... చూడగానే వేసేసుకోబుద్దేస్తుందన్నమాట. నా బాయ్ ఫ్రెండ్‌కి ఆఫీసుకి ఫోన్ చేసి దాని గురించి రెండు నిమిషాలు చెప్పానో లేదో, "పాంటీ విషయం త్వరగా ముగించకపోతే ఫోన్ పెట్టేస్తా!' అన్నాడు దట్ మోస్ట్ అన్ రొమాంటిక్ ఫెలో!

**శ్రీమతి:** మీరోటి అర్థం చేసుకోండి. ఆడవాళ్ల విషయంలో సంభాషణ అనేది సాన్నిహిత్యం కోసం అభ్యర్థన అన్నమాట. మగాడి విషయంలో అది విమర్శించడానికి, ఒప్పుకోడానికీ, చివరికి లొంగిపోడానికి దారితీస్తుంది. 'ఈసారి పండక్కి చీర కొనాలి' అని నువ్వు మాట్లాడ్డం మొదలెట్టావనుకో. అది జస్ట్ కబుర్లు చెప్పుకొనేందుకు నాంది, ఓ సాకు అన్నమాట. 'కొన్నా, కొనకపోయినా పరవాలేదు, ఏదో ఆ విషయంగా సరదాగా నాలుగు మాటలు మాట్లాడుకోవచ్చ'ని నువ్వనుకుంటావు. కానీ మగాడి పరిస్థితి ఆలోచించి చూడు. ఆ విషయమై మాట్లాడాలంటే చీర గురించి ఏదో ఒకటి అనాలి కదా. అనవసరమని వాదించాలి; ఆ తర్వాత 'కొంటానులే' అని ఒప్పుకోవాలి; అతనికిష్టం లేకపోయినా చివరికి కొనాలి. నీ మాటకు సమాధానం చెప్పాలన్నా, కనీసం వ్యాఖ్యానించాలన్నా ఈ ఇబ్బందులన్నీ పడాలి. కాదంటే చిలికి చిలికి పెద్ద వాగ్వాదం కావచ్చు. అందువల్ల మౌనం భూషణం అనుకుంటాడు మగాడు. అందుకే నీ మాట వినబడనట్టు నటిస్తాడు.'

**భామ:** అందుకనే నేను మగాళ్ల మాటల గురించి పట్టించుకోను. మనసులో ప్రేమ ఇతర రకాలుగా వ్యక్తీకరిస్తున్నాడా, లేదా అని చూస్తాను. నే నక్కడ ఉండగా ఫోనొస్తే త్వరగా మాట్లాడి పెట్టేస్తున్నాడా, లేదా? నేను గోళ్లరంగు వేసుకున్నరోజు వాటికేసి చూశాడా, లేదా? కొత్త చీర కట్టిన రోజున కళ్లెగరేశాడా, లేదా? - ఇలాంటివి చూస్తాను. వాటితో సరిపెట్టుకుంటాను. ఏం చేస్తాం మరి?

-శిల్ప